RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | ఆదివారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 213 | జులై 20, 2025 | వెల : రూ.3-00



### బండి, ఈటల అంశంపై
## నేతలు మాట్లాడొద్దు..

**వేద న్యూస్, హైదరాబాద్**

కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ అంశంపై ఎవరూ మాట్లాడొద్దని బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఆదేశాలు జారీ చేసింది. మిగతా 4వ పేజీలో..



# రోగుల ప్రాణాలతో చెలగాటం..?

- రేనే ఆస్పత్రిలో రోగుల ప్రాణాలకు భద్రత కరువు..?
- కాలం చెల్లిన మందులను విక్రయిస్తున్న వైనం..!

**వేద న్యూస్, కరీంనగర్ :**

ప్రజలు అనేక రోగాలతో సతమతమవుతూ తమ వ్యాధులను తగ్గించుకోవడానికి ఆసుపత్రుల బాట పట్టడం సర్వసాధారణమైనది. అయితే ఈ క్రమంలో కొన్ని ప్రధాన నగరాలలోని హాస్పిటల్స్ ఇదే అదునుగా భావించి తమ ఆసుపత్రులకు వచ్చే రోగులను పీల్చి పిప్పి చేస్తున్నారు. ఈ క్రమంలో చాలా అక్రమాలకు కూడా పాల్పడుతున్నారు. తాజాగా ఓ మహిళ రేనే హాస్పటల్ పై పలు ఆరోపణలు చేసింది. బాధిత మహిళ తెలిపిన వివరాల ప్రకారం..కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రేనే హాస్పటల్ కు 17జూలై 2025వ తేదీన ఓ మహిళ అనారోగ్యం చేసిందని హెల్త్ చెకప్ కు వెళ్లింది. డాక్టరు ఆమె ఆరోగ్యాన్ని పరిశీలించి పలు రకాల మందులను రాసి ఇచ్చారు. మందులను తీసుకుందామని హాస్పిటల్ లోని మెడికల్ షాపు కి వెళ్ళగా వారు మందులను ఇచ్చారు. వెంటనే ఇంటికి వెళ్లి మందులను వేసుకునే టైంకి వాటిని పరిశీలించగా, నాప్రోయాక్ట్-డి 500 అనే ఔషధం తేడాగా కనబడింది.అది ఏమిటంటే?దాని ఎక్స్పైరీ ని పరిశీలించగా డేట్ అయిపోయి ఉంది గమనించాడు. అంతే కాకుండా రేటు కూడా ఎంఆర్పి కంటే ఎక్కువ బిల్లు వేశారు. ఈ విషయాలను గమనించిన పేషంట్ ఒక్కసారి కంగుతిన్నది. జిల్లా కేంద్రంలో పేరుగాంచిన హాస్పటల్లో ఇలా జరగడమేమిటని? ఆశ్చర్యానికి గురికావాల్సిన పరిస్థితి ఎదురైన ఆమెకు. ఒకవేళ పై విషయాలను గమనించకుండా టాబ్లెట్లను వేసుకుంటే తన పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తుంది.రేనే హాస్పిటల్, డాక్టర్, మెడికల్ షాప్ నిర్వాహకం పట్ల ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అమాయక ప్రజలు తమ వ్యాధులు నయమవుతావని నమ్మకంతో



మారుమూల ప్రాంతాల నుండి పెద్దపెద్ద ఆసుపత్రులను ఆశ్రయించగా, వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని బడా ఆసుపత్రులు ఇలా అక్రమాలకు పాల్పడుతూ, సామాన్య ప్రజల ఆరోగ్యాలతో వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని జిల్లా జిల్లా కేంద్రంలో చర్చగా మారింది. అసలు ఎక్స్పైరీ అయిన మందులను ఒక ప్రముఖ ఆసుపత్రిలో రోగులకు ఎలా ఇస్తారు? అంతేకాకుండా ఉన్న ఎంఆర్పి కంటే అధిక ధరలు ఎలా వసూలు చేస్తారు.?ఇది డాక్టర్ల పర్యవేక్షణలోనే జరుగుతుందా? లేదా దీని వెనుక ఏమన్నా ముసుగు దందా నడుస్తుందా? అని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘటనపై సంబంధిత శాఖ అధికారులు స్పందించి విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



### హైకోర్టు సీజేగా బాధ్యతలు స్వీకరించిన
# అపరేష్ కుమార్ సింగ్

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మచే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ పదవీ స్వీకార ప్రమాణం చేయించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. శనివారం రాజ్‌భవన్ దర్బార్ హాలులో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ తో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, సలహాదారులు, ప్రజాప్రతినిధులు, హైకోర్టు న్యాయమూర్తులు, నగర ప్రముఖులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

**- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ**

**వేద న్యూస్, హన్మకొండ:**

ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని అటవీ పర్యావరణ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం రాష్ట్ర మంత్రి కొండా సురేఖ హనుమకొండ రాంనగర్ లోని తమ నివాసంలో ప్రజల నుంచి వినతులను విజ్ఞప్తులను స్వీకరించారు.ప్రజల సమస్యలను సావధానంగా వింటూ అప్పటికప్పుడే సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రివర్యులు కొండా సురేఖ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తుందని పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా నూతన పథకాలు ప్రవేశ పెడుతూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్న ప్రభుత్వం అన్నారు. గత ప్రభుత్వంలో ఏ ఒక్క పేదవాడికి న్యాయం జరగలేదని తెచ్చుకున్న తెలంగాణ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా ఎన్నికల్లో నిరుపేదలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు నిరుపేదల కన్నీళ్లను తుడిచేందుకు ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిందని మంత్రి కొండా సురేఖ తెలిపారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు, మరియు ఇందిరమ్మ ఇండ్లను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలోనే పేదల కల సహకారం అవుతుందని ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యంగా వ్యవసాయం విద్య వైద్య రంగాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలే నిదర్శనం అని అన్నారు. కొండా దంపతులు వరంగల్ తూర్పు ప్రజలకు ఎలాంటి ఆపద సమయంలోనైనా ఎల్లవేళలా అండగా ఉంటారని ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు.



# రోడ్లు వేయండి మహా ప్రభో..!

**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం రత్నంపేట గ్రామం సమస్యలతో కొట్టుమిట్టాడుతుంది. ఎన్నో సందర్భాలలో గ్రామ సమస్యలపై పరిపాలన అధికారుల దృష్టికి తెచ్చిన కూడా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. రత్నంపేట గ్రామపంచాయతీగా ఆవిర్భవించిన సందర్భంలో కల్వర్టు నిర్మాణాన్ని చేపట్టి వర్షపు నీరు పోయే విధంగా గత 30 సంవత్సరాల క్రితం నిర్మాణం చేశారు. ఈ మధ్యకాలంలో కల్వర్టు నుంచి వర్షం నీరు పోకుండా కొంతమంది వ్యక్తులు కల్వర్టు మూసివేశారు. ఇలా చేయడం వల్ల వర్షం వచ్చినప్పుడు నీరు కింది వైపుకు వెళ్లకుండా రోడ్డు మీద నిలవడం వల్ల గ్రామంలోని ప్రజలు, ద్విచక్ర వాహనదారులకు , స్కూల్ పిల్లల ఆటోలకు,తీవ్ర ఇబ్బందులు కలుగుతుంది. సమస్యను పరిష్కరించకుండా కార్యదర్శి జాప్యం చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా గ్రామ ప్రజల ఇబ్బందినీ దృష్టిలో పెట్టుకొని సమస్యను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికార యంత్రంగానికి గ్రామ ప్రజల తరఫున మండల సిపిఎం పార్టీ పక్షాన పత్రిక ముఖంగా గురజాల శ్రీధర్ విజ్ఞప్తి చేశారు.

# అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ..!

- తక్షణమే డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలి
- ఏఐవైఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి దొంతర వేణి మహేష్

**వేద న్యూస్, బెజ్జంకి :**

బెజ్జంకి మండల కేంద్రం మండలంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మట్టితో మరుగు కాలును పూడ్చిన పట్టించుకోని అధికారులు తక్షణమే డ్రైనేజీ సమస్యలను పరిష్కరిం చాలని ఏఐవైఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి దొంతర వేణి మహేష్ అన్నారు. వర్షాకాలం నీరు నిలువ ఉంటే సీజనల్ వ్యాధులు ప్రబలించే అవకాశం ఉందని సంబంధిత జిల్లా అధికార యంత్రాంగం ఒక పక్క సూచిస్తున్న బెజ్జంకి మండల కేంద్రంలో స్థానిక సంబంధిత ఉన్నత అధికారులు మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో గతం లో నిర్మించిన డ్రైనేజీని మట్టితో పూడ్చిన మురికి కాలువను స్థానిక ఏఐవై ఎఫ్ నాయకులతో కలిసి పరిశీలించారు.మండల కేంద్రంలోని ఓ డ్రైనేజీని మట్టితో పూడ్చివేసిన స్థానిక గ్రామపంచాయతీ కార్యదర్శి మాత్రం తెలిసి తెలియనట్లుగా వ్యవహరిస్తున్నారని సమస్యను పరిష్కరించాలని పలుమార్లు స్థానిక గ్రామపంచాయతీ కార్యదర్శికి కాలనీ వాసులు,స్థానికులు విన్నవించిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. తక్షణమే అధికారులు స్పందించి సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవై ఎఫ్)ఆధ్వర్యంలో జిల్లా అధికారులకు పిర్యాదు చేస్తాము అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐవై ఎఫ్ నాయకులు రొడ్డ



చరణ్,సంగెం సతీష్,అంతటి రాకేష్,నరేష్ స్థానికులు పాల్గొన్నారు.

# చిట్యాలపల్లిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం

**వేద న్యూస్, చొప్పదండి**

పల్లె పల్లెకు కాంగ్రెస్ జెండా - సబ్బండ వర్గాలకు ప్రజా ప్రభుత్వ అండ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిట్యాలపల్లి గ్రామంలో గ్రామ ఇంచార్జి నిజానపురం చందు గ్రామశాఖ అధ్యక్షులు సముద్రాల మల్లేశం ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. తదుపరి ఇంటింటి ప్రచారంలో భాగంగా గ్రామ ప్రజల నుండి పలు సమస్యలపై వచ్చిన వినతి పత్రాలను స్వీకరించారు. అనంతరం మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం చిట్యాలపల్లి గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని గ్రామంలో అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను ఇప్పించడంతో పాటు ప్రతీ ఎకరానికి రైతు భరోసా నిధులను విడుదల చేయించారన్నారు. చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం సహకారంతో చిట్యాలపల్లి నుండి గుమ్లాపూర్ వరకు 4.50 కోట్ల రూపాయల నిధులతో చేపట్టిన తారు రోడ్డు నిర్మాణ పనులు వేగంగా నడుస్తున్నాయని అలాగే చిట్యాలపల్లి నుండి ఆర్నకొండ గ్రామం వరకు బిటి రోడ్డు మరమ్మత్తులకు నిధులు మంజూరయ్యాయని త్వరలో టెండర్లు పిలిచి పనులు చేపడతామన్నారు. రాబోవు రోజుల్లో చిట్యాలపల్లి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ ఛైర్మన్ కొత్తూరు మహేష్, చిట్యాలపల్లి మాజీ సర్పంచ్ ఎన్నం మనోహర్, మాజీ ఉప సర్పంచ్ సత్యనారాయణ రావు, మధు, సాయి, పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, ఆత్మ ఛైర్మన్ గుర్రం రాజేందర్ రెడ్డి,



నాయకులు ముగ్దం తిరుపతి, పెరుమాండ్ల గంగయ్య, రాములు, రమేష్, శంకర్, శంకరయ్య, సత్యం, రాములు, శ్రీనివాస్, రవి, వేణుగోపాల్ రాజు, శ్రీనివాస్, శ్రీనివాస్, రాజేష్, శ్రీనివాస్, పాల్గొన్నారు.



## దేవాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దుతా

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

వేములపల్లి మండల కేంద్రంలోని ఆమనగల్లు శ్రీ పార్వతి రామలింగేశ్వర దేవాలయం కోరుకుంటే వరాలు ఇచ్చే దేవాలయం గా నిలిచిందని మిర్యాల గూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం ఉదయం కుటుంబ సమేతంగా సందర్శించారు. అనంతరం దేవాలయ పురోహితులు రెంటాల సతీష్ శర్మ ఆధ్వర్యంలో తన కుమారుడిని పెళ్లి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేవాలయాన్ని సుందరంగా తీర్చి దిద్దుతానన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పరిపాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. ఆయన వెంట దేవాలయ చైర్మన్ తాళ్ల వెంకటేశ్వర్లు,కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



## రసాయనాలకు బదులు కషాయాలను తయారు చేసి వాడాలి

**వేద న్యూస్, చొప్పదండి**

చొప్పదండి మండలం కాట్నాపల్లె గ్రామంలో డబ్లుడబ్లుఎఫ్ వారి సహకారంతో శనివారం నవక్రాంతి ఉత్పత్తిదారుల సంస్థ వారి ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బిసిఐ ప్రాజెక్ట్ సిబ్బంది కర్కాలి వనిత మాట్లాడుతూ మానవ ఆరోగ్యం పర్యావరణంపై అత్యంత విషపూరిత పురుగు మందులను హెచ్ హెచ్ పి సి పాన్ గ్రూప్ 3 యొక్క హానికరమైన ప్రభావాలను కలిగి ఉంటుందని తెలిపారు. ఈ పురుగు మందులు దీర్ఘకాలంలో క్యాన్సర్, జన్యు సమస్యలు, హార్మోన్ సమస్యలు కారణం అవుతాయని వివరించారు. పర్యావరణంపై తీవ్రమైన ప్రతికూల ప్రభావాన్ని చూపి పక్షులు, జరచరాలు, జంతువులకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని రైతులకు తెలిపారు. ఈ పురుగు మందులను పూర్తిగా ఆపి వేయాలని తెలిపారు. ఈ రసాయన మందులకు బదులుగా రైతు చేను దగ్గర కషాయాలను తయారుచేసి వాటిని వాడడం ద్వారా పర్యావరణాన్ని, మానవుని ఆరోగ్యాన్ని, నేలను కాపాడిన వాళ్ళము అవుతామని తెలియజేశారు. ఈ కషాయాన్ని వాడుకునే విధానాన్ని రైతుల ముందే కషాయం తయారు చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కట్టేకోల తార లక్ష్మణ్, గ్రామ రైతులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు

**వేద న్యూస్,బోయినపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం మనువాడ గ్రామం నుండి బోయినిపల్లి మండల బిఆర్ఎస్ యూత్ అధ్యకుడు కట్ట గోవర్ధన్ తో పాట మనువాడ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు దాదాపు 20 మంది కాంగ్రెస్ పార్టీ లో చేరడం జరిగింది. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, చేతులమీదుగా కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## షైన్ ఉన్నత పాఠశాలలో ఘనంగా బోనాల ఉత్సవాలు



**వేద న్యూస్, హన్మకొండ:**

షైన్ ఉన్నత పాఠశాల రాంనగర్ డిలైట్ క్యాంపస్ లో బోనాల పండుగ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. బోనాల పండుగ విశిష్టత విద్యార్థులు వివరించారు. ఈ వేడుకలకు షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరే ప్రారంభించారు. విద్యార్థుల ముత్యాలను పోతురాజుల విన్యాసాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో షైన్ విద్యాసంస్థల డైరెక్టర్ మూగల రమ, ప్రిన్సిపాల్ ప్రగతి రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో హాజరై బోనాలకు ఉన్న విశిష్టతను తెలుసుకున్నారు. విద్యార్థులకు వివరించారు.

## నేరస్తులకు శిక్ష పడే విధంగా కృషి చేయాలి

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**



ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తును చేపట్టి నేరస్తులకు శిక్షపడే విధంగా అధికారులందరూ కృషి చేయాలని అధికారులకు సూచించిన జిల్లా ఎస్పీ పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో ఎస్పీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. మొదటగా జిల్లాలో నేరాల నియంత్రణకు తీసుకుంటున్న భద్రత చర్యలు,పోలీస్ స్టేషన్ల వారిగా పెండింగ్లో ఉన్న కేసులు వాటి వివరాలు ప్రస్తుత స్థితిగతులు అడిగి తెలుసుకుని పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతీ కేసులో సమగ్ర దర్యాప్తుని చేపట్టి నేరస్తులకు శిక్షపడే విధంగా కృషి చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని,కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని పోలీస్ అధికారులంతా బాధ్యతగా వ్యవహరించాలని ఆదేశించారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పనిచేయాలని తెలిపారు. ప్రాసిక్యూషన్ లో భాగంగా కోర్టు వారు జారిచేసిన నాన్ బెయిలబుల్ వారెంట్లను నిందితులపై,తప్పించుకుని తిరుగుతున్న నేరస్తులపై పకడ్బందీగా అమలు చేయాలనలన్నారు. త్వరలో లోకల్ బాడీ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందును అధికారులు,సిబ్బంది సన్నద్ధంగా ఉండాలి పకడ్బందిగా పని చేయాలని, గ్రామాలలో జరిగే శాంతి భద్రతల అంశాలను ముందస్తు సంచారం సేకరించి సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ రద్దీగాల ప్రాంతాల్లో, ప్రధాన కూడళ్ళ వద్ద గస్తీ కస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు,మట్కా,జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య,సిఐలు మొగిలి, శ్రీనివాస్,వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మధుకర్, నాగేశ్వరరావు, నటేష్,ఆర్.ఐ లు మధుకర్, రమేష్, యాదగిరి, ఎస్.ఐ లు ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

## పంతులుపల్లి విద్యార్థులకు నోటు బుక్స్ పంపిణీ



**- వాసవి క్లబ్ వరంగల్ సెంట్రల్ వారి సౌజన్యంతో**

**వేద న్యూస్, నల్లబెల్లి :**

నల్లబెల్లి మండలం, నాగరాజుపల్లి గ్రామ పరిధిలోని పంతులుపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, వాసవి క్లబ్ వరంగల్ సెంట్రల్ వారి సౌజన్యంతో ఉచితంగా నోటు బుక్స్ పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కర్ణకంటి రాంమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ఏఏపిసి చైర్మన్ ఎరుకుల వెంకటలక్ష్మి, గ్రామ మాజీ సర్పంచ్ గోనె శ్రీదేవి, మాజీ ఎంపిటిసి ఏడాకుల రవిందర్, మామిండ్లవీరయ్యపల్లి గ్రామ మాజీ సర్పంచ్ ఆసం చంద్రమౌళి అతిథులుగా హాజరై విద్యార్థులకు నోటు బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఏఏపిసి చైర్మన్ ఎరుకుల వెంకట లక్ష్మి మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలోని తమ పాఠశాల విద్యార్థులకు నోటు బుక్స్ పంపించిన వాసవి క్లబ్ వరంగల్ సెంట్రల్ వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు పాఠశాల సహోపాధ్యాయులు కూనమల్ల రాజన్ బాబు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ మొదటి గెలల కోత కొనుగోలు

**- పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం మర్లపేట గ్రామంలో నిర్వహించిన ఆయిల్ పామ్ మొదటి గెలల కోత అలాగే కొనుగోలు కార్యక్రమంలో చొప్పదండి శాసనసభ సభ్యులు మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, రైతులతో మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ పంట వైపు మొగ్గు చూపాలని చెప్పి తాను కూడా ఆయిల్ ఫామ్ పంటను సాగు చేస్తాననీ చెప్పారు. ఆయిల్ ఫామ్ పంట కొనుగోలు ఒప్పంద పత్రాలని రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ టి శేఖర్, జిల్లా ఉద్యాన అధికారి లత, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, తాసిల్దార్ నారాయణ రెడ్డి, ఎంపీడీవో జయ శీల, మండల



వ్యవసాయ అధికారి ప్రణీత, ఉద్యాన శాఖ అధికారులు లోకేష్, గోవర్ధన్, ఏఈఓ రజిత, పంచాయతీ సెక్రెటరీ, ప్రియునిక్ కంపెనీ జనరల్ మేనేజర్ మల్లేశ్వరరావు, జోనల్ మేనేజర్ రోహిత్, జిల్లా మేనేజర్ ప్రేమ్ సాయి, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీకాంత్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సబ్ రిజిస్టార్ కార్యాలయాన్ని సందర్శించిన సబ్ కలెక్టర్

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

మిర్యాలగూడ సబ్-కలెక్టర్ నారాయణ అమిత్ పట్టణ పరిధిలోని సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. కార్యాలయము నందు గల పలు రికార్డులను తనిఖీ చేశారు. మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్ చేయుటకు సంబంధిత శాఖ నుండి ఎన్ఓసి తీసుకోవాలని ఆదేశిం చారు. రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలకు అసౌకర్యం కలిగించవద్దని సిబ్బందికి సూచించారు.



## అశోక్‌కు అండగా ఉంటా



**- తాళ్ల వెంకటేశ్వర్లు**

**వేద న్యూస్, సూర్యాపేట ప్రత్యేక ప్రతినిధి :**

ఆమనగల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేత గౌరోజు అశోక్ ఇటీవల అనారోగ్యానికి గురై జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానిక నాయకులు సోషల్ మీడియా ద్వారా విషయం తెలుసుకున్న ఆమనగల్లు శ్రీ పార్వతి రామలింగేశ్వర దేవాలయ చైర్మన్ తాళ్ల వెంకటేశ్వర్లు ఆస్పత్రికి చేరుకొని అశోక్ ను పరామర్శించారు. అనంతరం డాక్టర్లను కలిసి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అశోక్ ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. నువ్వు ఉన్నంతకాలం..నీకు అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఆయన వెంట ఐ ఎన్ టి యు సి రాష్ట్ర నాయకులు బంటు చొక్కయ్య గౌడ్, ఆమనగల్లు మాజీ ఎంపీటీసీ వల్లంపట్ల అబ్రహం, మేక మాణిక్యం ఉన్నారు.

## వాణీనికేతన్ హైస్కూల్‌లో ఘనంగా బోనాల సంబరాలు



**వేద న్యూస్, ఇల్లంతకుంట :**

ఇల్లంతకుంట మండల కేంద్రంలోని వాణినికేతన్ హై స్కూల్లో బోనాల సంబరాలు ఘనంగా జరిగాయి. తెలంగాణ సంస్కృతిపై విద్యార్థులకు అవగాహన కల్పించాలనే లక్ష్యంతో శనివారం ఏర్పాటుచేసిన బోనాల కార్యక్రమం ఆకట్టుకుంది. విద్యార్థులు బోనాలు ఎత్తుకొని పాఠశాల నుండి బస్టాండ్ మీదుగా పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకున్నారు. పోతరాజుల విన్యాసాలు, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అబ్బురపరిచాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ తూముకుంట శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్ శ్రీనిధి ఉపాధ్యాయులు శ్రీనివాస్, సంతోష్, రాజు, రమేష్, తిరుపతి, రాజు,సుమంగళి, శోభ, సునంద, రేఖ, కళ్యాణి, రేణుక, లావణ్య మహాలక్ష్మి, జలజ మౌనికరేణుక శాంత, పద్మ సునీత, శామీమాలతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా బోనాల పండుగ

**- పోతారాజు వేషాలతో అలరించిన విద్యార్థులు**

**వేద న్యూస్,బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కోరేం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఈ రోజు ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. స్కూల్ విద్యార్థులు బోనాలు తీసుకొని పెద్దమ్మ తల్లి దేవాలయం కు వెళ్లి మొక్కలు చెల్లిచుకున్నారు పిల్లలు పోతారాజు ల వేశాధారణ చేసుకొని నృత్యాలు చేస్తూ గ్రామ ప్రజలను ఆకట్టుకోవడం జరిగింది. ఈ పండుగను ఆషాడ మాసంలో ప్రారంభించి శ్రావణమాసం చివరిదాకా జరుపుకోవడం జరుగు తుంది. వర్షాలు బాగా కురవాలని పంటలు బాగా పండాలని ప్రజలంతా ఎలాంటి అనారోగ్యాల బారిన పడకుండా ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు,విద్యార్థిని విద్యార్థులు, పాల్గొన్నారు.

# తెలంగాణ బాధితుల పరిహార పథకం 2015

**వేద న్యూస్, రంగారెడ్డి :**

నేరం ఫలితంగా నష్టం లేదా గాయం కలిగిన బాధితులకు లేదా వారిపై ఆధారపడిన వారికి పునరావాసం కల్పించడానికి తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ బాధితుల పరిహార పథకం 2015 రూపొందించింది.

**దరఖాస్తు చేయాల్సిన విధానం**

– పరిహారం చెల్లించాల్సిన నేరం తెలంగాణ రాష్ట్రంలోనే జరిగి ఉండాలి.

– బాధితుడు లేదా అతనిపై ఆధారపడినవారు నేరం జరిగిన 48 గంటల్లోపు పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ అధికారికి/ఏదైనా సీనియర్ పోలీసు అధికారికి/ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్/జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌కు నివేదించి ఉండాలి.

– ఈ పథకం సంవత్సరానికి రూ.4,50,000/- మించని కుటుంబానికి వర్తిస్తుంది. ప్రభుత్వ ఉద్యోగులు, కార్పొరేషన్లు, బోర్డులు, ప్రభుత్వ సంస్థలు మరియు ఆదాయపు పన్ను చెల్లింపుదారులు ఈ పథకం కింద అర్హులు కారు.

**ఈ పథకం కింద పరిహారం పొందేందుకు అర్హత**

– సీఆర్పీసీ సెక్షన్ 357- ఏ(2) లేదా యూఎల్ఎస్ 357-ఏ (3) కింద పరిహారం చెల్లించాలని కోర్టు సిఫార్సు చేసిన తర్వాత నేరస్థుడిని గుర్తించకపోతే లేదా గుర్తించకపోతే మరియు విచారణ జరగకపోతే, బాధితుడు లేదా అతని ఆధారపడినవారు సీఆర్పీసీ సెక్షన్ 357-ఏ (4) కింద పరిహారం చెల్లించాలని లీగల్ సర్వీసెస్ అథారిటీలకు చేసిన దరఖాస్తుపై. నేరం జరిగిన 12 నెలల వ్యవధి తర్వాత అటువంటి క్లెయిమ్ పిటిషన్‌ను స్వీకరించకూడదు.

– బాధితుడు లేదా అతనిపై ఆధారపడినవారు దర్యాప్తు మరియు విచారణ సమయంలో పోలీసులు మరియు ప్రాసిక్యూషన్‌కు సహకరించాలి.

**పరిహారం మంజూరు చేసే విధానం**

– సీఆర్పీసీ సెక్షన్ 357-ఏ (2) లేదా సెక్షన్ 357-ఏ (3) కింద కోర్టు సిఫార్సు చేసినప్పుడు లేదా సీఆర్పీసీ సెక్షన్ 357-ఏ (4) కింద బాధితుడు లేదా అతనిపై ఆధారపడినవారు దరఖాస్తు చేసినప్పుడు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కేసును పరిశీలిస్తుంది. నివేదించబడిన నేర కార్యకలాపాల కారణంగా బాధితుడికి జరిగిన నష్టం లేదా గాయానికి సంబంధించి క్లెయిమ్‌ను ధృవీకరిస్తుంది. క్లెయిమ్ యొక్క వాస్తవికతను నిర్ణయించడానికి సంబంధిత సమాచారాన్ని కూడా కోరవచ్చు. ధృవీకరించి తగిన విచారణ నిర్వహించిన తర్వాత జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ రెండు నెలల్లోపు పరిహారం మంజూరు చేస్తుంది.

– బాధితుడికి జరిగిన నష్టం, చికిత్సకు అయ్యే వైద్య ఖర్చులు మరియు అంత్యక్రియల ఖర్చులు వంటి యాదృచ్ఛిక ఛార్జీలతో సహా పునరావాసం కోసం అవసరమైన కనీస జీవనాధార మొత్తాన్ని బట్టి డీఎల్ఎస్ఏ పరిహారం పరిమాణాన్ని నిర్ణయిస్తుంది.

– వాణిజ్య లైంగిక దోపిడీ మరియు అక్రమ రవాణా బాధితురాలు ఎదుర్కొన్న గాయం మరియు అటువంటి బాధితుల పునరావాసం మరియు పునరావాసం యొక్క అంశాలను లీగల్ సర్వీసెస్ అథారిటీ పరిగణనలోకి తీసుకుని పరిహారం ఇస్తుంది.

– లీగల్ సర్వీసెస్ అథారిటీ పోలీసు అధికారి, పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ లేదా ఆరెస్ మేజిస్ట్రేట్ సర్టిఫికెట్‌పై తక్షణ ప్రథమ చికిత్స సౌకర్యం లేదా వైద్య ప్రయోజనాలను ఉచితంగా ఆదేశించవచ్చు.

– బాధితుడు లేదా హక్కుదారుల నుండి పరిహారం మంజూరు చేసేటప్పుడు, తదుపరి పరిహారం మంజూరు చేసే సందర్భంలో, అతను 357-ఏ సీఆర్పీసీ సెక్షన్ కింద పరిహారంగా అందుకున్న అదనపు మొత్తాన్ని చెల్లించాలి అనే హామీని పొందాలి. ఆ నేరానికి సంబంధించి బాధితుడు రాష్ట్రం నుండి పొందిన పరిహారం, అంటే భీమా, ఎక్స్-గ్రేషియా లేదా ప్రభుత్వ ఉత్తర్వుల కింద పొందిన చెల్లింపులు మొదలైనవి ఈ పథకం కింద పరిహారంలో భాగంగా పరిగణించబడతాయి.

– మోటారు వాహన చట్టం కింద కవర్ చేయబడిన కేసులు, ట్రిబ్యునల్ ద్వారా పరిహారం ఇవ్వాల్సిన కేసులు మరియు ప్రభుత్వం జారీ చేసిన జీఓలు ద్వారా కవర్ చేయబడిన కేసులు ఈ పథకం పరిధిలోకి రావు.

– పరిహారం షెడ్యూల్ బ్యాంక్ ద్వారా పంపిణీ చేయబడుతుంది, పరిహారం పొందబడుతుంది. చెడు, బాధించే, కల్పిత ఫిర్యాదుకు సంవత్సరానికి 12శాతం వడ్డీతో తిరిగి పొందే అవకాశం ఉంది.

– పరిహారం మొత్తం క్రింద ఇవ్వబడిన షెడ్యూల్ ప్రకారం ఉంటుంది మరియు బాధితుడికి లేదా అతని ఆధారపడిన వారికి బాధితుల పరిహార నిధి నుండి పంపిణీ చేయబడుతుంది.

**షెడ్యూల్ (పేరా 7 (8))**

నేర ఘటనల్లో ప్రాణనష్టం, శాశ్వత వైకల్యం లేదా ఇతర గాయాల పట్ల బాధితులకిచ్చే గరిష్ఠ పరిహారాన్ని వివరిస్తారు. 40 ఏళ్లు లేదా అంతకంటే తక్కువ వయస్సు గల వారు ప్రాణ నష్టం చనిపోతే రూ.3 లక్షలు, 40%-%60 ఏళ్ల మధ్య వయస్సు గలవారికి రూ.2 లక్షలు, మరియు 60 ఏళ్లు పైబడినవారికి రూ.1 లక్ష వరకు పరిహారం ఇవ్వబడుతుంది. శాశ్వత వైకల్యం (80శాతం లేదా అంతకంటే ఎక్కువ) కలిగిన వారికి వరుసగా రూ.2 లక్షలు (40 ఏళ్లు లోపల), రూ.1 లక్ష (40%-%60 ఏళ్లు), మరియు రూ.50,000 (60 ఏళ్లు పైగా) వరకు పరిహారం లభిస్తుంది. ఆంశిక వైకల్యం (80శాతం లోపల) ఉన్న బాధితులకు 40 ఏళ్ల లోపు వారికి రూ.1 లక్ష, 40%-%60 సంవత్సరాల వారికి రూ.50,000 మరియు 60 ఏళ్లు పైబడి ఉన్న వారికి రూ.25,000 పరిహారంగా ఇచ్చే అవకాశం ఉంది.

– యాసిడ్ దాడుల వల్ల శరీర భాగం కోల్పోయిన వ్యక్తులకు వయస్సుతో సంబంధం లేకుండా రూ.3 లక్షల పరిహారం లభిస్తుంది, ఇందులో ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసిన 15 రోజుల్లో రూ.1 లక్ష వెంటనే చెల్లించబడుతుంది. మిగిలిన మొత్తాన్ని 2 నెలల్లోపు చెల్లించాల్సిందిగా సుప్రీంకోర్టు లక్ష్మీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (2013) తీర్పులో పేర్కొంది. అత్యాచార బాధితులకు రూ.2-10 లక్షల పరిహారం లభిస్తుందని పథకంలో ఉంది. అలాగే, మానవ అక్రమ రవాణా, అపహరణ, లైంగిక వేధింపులు వంటి ఘటనల వల్ల మహిళలు మరియు పిల్లలు ఎదుర్కొనే తీవ్రమైన మానసిక వేధింపులకు సంబంధించి రూ.50,000 పరిహారం అందించబడుతుంది.



నందిగామ నరేందర్,
ఎం.ఏ., ఎల్.ఎల్.బీ,
లీగల్ ఎయిడ్ కాంట్రిబ్యూటర్,
ఎల్‌బి నగర్,రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్, తెలంగాణ-500074, పోన్ నెంబర్ 989003647



## మానవత్వం చాటుకున్న బూర ఈశ్వరయ్య

**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండలం మాందారిపేట గ్రామానికి చెందిన బూర ఈశ్వరయ్య మానవత్వం చాటుకున్నారు. గత కొన్ని రోజులుగా మండలంలోని మాందారి పేట స్టేజి బస్టాండ్ లో ఒక గుర్తు తెలియని వ్యక్తి మతి స్థిమితం కోల్పోయి అక్కడే ఉంటున్నాడు. అది గమనించిన స్థానిక వాసి అయిన బూర ఈశ్వరయ్య అతనిని చెర తీసి అతని కి స్నానం,క్షవరం, అన్నం తినిపించి మానవత్వం చాటుకున్నారు. మానవత్వం చాటుకున్న ఈశ్వరయ్యను గ్రామ ప్రజలు అభినందించారు.

## కోతులు,కుక్కల బెడద నుండి రక్షించండి



**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

గ్రామ పంచాయతీలలో పక్కాగా మౌలిక సదుపాయాలు కల్పించాలని దామరచర్ల సిపిఐ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయ సూపరిడెంట్ అధికారి జీ ఎస్ మూర్తి కి వినతి పత్రం అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా దామరచర్ల మండల కార్యదర్శి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పోలేపల్లి ఉదయ్ కుమార్ మాట్లాడుతూ దామరచర్ల మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాలలో కోతులు,కుక్కలు బెడద పెరిగిపోయి ప్రజలప్రాణాల కు రక్షణ లేకుండా పోయిందని, అలాగే మౌలిక సదుపాయాలు కల్పించడం లో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు.దామరచర్ల వ్యాప్తంగా ఉన్న గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. పలు గ్రామాలలో గత కొన్ని నెలల నుండిమిషన్ భగీరథ ట్యాంకులను పరిశుభ్రం చేయడం లేదని, దామరచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎల్లవేళలా వైద్యులు అందుబాటులో ఉండటం లేదని ఆరోపించారు. గ్రామపంచాయతీల్లో తక్షణమే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా డ్రైనేజీ వ్యవస్థను పరిశుభ్రం చేయాలని ఈగలు,దోమలు రాకుండా శానిటేషన్ చేయించి బ్లీచింగ్ పౌడర్ వేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ దామరచర్ల సహాయ కార్యదర్శి ధనావత్ శాంతి,సిపిఐ గౌరవ నాయకులు గజ్జల లక్ష్మీనరసింహ రెడ్డి,సీనియర్ సిపిఐ నాయకులు జమ్ముల కోటయ్య,సుద్ధబోయిన రాములు,రవినాయక్,రాజశేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## వృద్ధాశ్రమాలను తనిఖీ చేసిన సిడిపిఓ



**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

సీడీపీఓ మిర్యాలగూడ మమత ఆధ్వర్యంలో అవంతిపురం వృద్ధాశ్రమం అయిన గురు సాయి వెల్ఫేర్ అసోసియేషన్ ను, పట్టణంలోని బాపూజి నగర్ సంరక్ష ఓల్డేజ్ హోమ్ వృద్ధాశ్రమం ను సందర్శించడం జరిగింది.ఈ సందర్భంగా సీడీపీఓ మమత వృద్ధాశ్రమంలో ఉన్న మౌలిక వసతులు భోజనం వారి యొక్క రూమ్స్, మంచి నీటి సదుపాయం,టాయిలెట్స్,వంటగది పరిశుభ్రత తదితర వసతులను ప్రత్యేకంగా పరిశీలించడం జరిగింది.అదేవిధంగా వారి యొక్క ఆరోగ్య పరిస్థితులను గురించి అడిగి తెలుసుకుని, వారికి అవసరమైన మెడిసిన్ మరియు మీడికల్ కిట్స్ గురించి అడిగి తెలుసుకున్నారు.

## బండి, ఈటల అంశంపై నేతలు మాట్లాడొద్దు..

మొదటిపేజీ తరువాయి

ఈ వ్యవహారంపై మీడియాతో మాట్లాడితే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించింది.పార్టీ అంత ర్గత వ్యవహారాలు మీడియాతో మాట్లాడొద్దని సూచించింది.


## మురికి నీటి సమస్యను పరిష్కరించాలి



**వేద న్యూస్, ఇల్లంతకుంట :**

ఇల్లంతకుంట మండల కేంద్రంలోని 7వ వార్డులో కొన్ని రోజుల క్రితం కురిసిన వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో మురికి నీరు నిలిచిపోయి కప్పుకొడుతుంది. మురికి నీటిలో పందులు స్వేచ్ఛగా సంచరిస్తూ చుటుపక్కల ప్రాంతాలను దుర్గంధంగా మార్చుతున్నాయి.ఈ మురికి పరిస్థితుల కారణంగా దోమలు విపరీతంగా పెరిగి, స్థానికంగా వైరల్.జ్వరాలు వ్యాపిస్తున్నాయి. దాదాపు ప్రతి ఇంట్లో ఒక్కరికి అయినా జ్వరాలు వస్తున్నాయని నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు ఇప్పటికే స్థానిక అధికారులను అనేక మార్లు అప్రమత్తం చేసినప్పటికీ, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని, పందుల ఉనికిని నియంత్రించాలని,

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



## పదేళ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు

**వేద న్యూస్, శాయంపేట :**

బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు పాలించినప్పటికీ ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. పేదలను నిరుపేదలుగా మార్చిన ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వంకే దక్కుతుందని ఎమ్మెల్యే ఆరోపించారు. పేదలకు కూడా సన్నబియ్యం అందించాలన్న ఉద్దేశంతో దేశంలో ఎక్కడాలేని విధంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టడం జరిగిందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఒక్క రేషన్ కార్డు కాని, ఒక్క కిలో సన్న బియ్యం కాని ఇవ్వలేదని ఆరోపించారు. అనంతరం కొత్త రేషన్ కార్డుల లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన

**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రహరీ క్లబ్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనకై అవగాహన కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ మాధవి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో శాయంపేట మండల విద్యాధికారి బిక్షపతి, మెడికల్ ఆఫీసర్ సాయి కృష్ణ, ఎస్సై జక్కుల పరమేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి మెడికల్ ఆఫీసర్ సాయి కృష్ణ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు గంజాయి, కొకెన్ ,పొగాకు సంబంధించినది ఉపయోగించడం వలన కలిగే నష్టాల గురించి వివరించారు. ఎస్ఐ జక్కుల పరమేష్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వాడడం వలన ఆత్మహత్య ఆలోచనలు ,నేర ప్రవృత్తి కలుగుతాయని




కావున మాదకద్రవ్యాలను దూరంగా ఉండాలని వివరించారు. మాదకద్రవ్యాల నిర్మూలన టోల్ ఫ్రీ నెంబర్ 144 46 కాల్ చేసి సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఎస్సై తెలిపారు. ఎంఈఓ బిక్షపతి విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా భవిష్యత్తులో మంచి లక్షణాలతో గొప్ప స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీదేవి, మంజుల, భాను శ్రీ, స్వప్న ,పాఠశాల ఎఎన్ఎమ్ ధన్య పాల్గొన్నారు.

## ఎస్ఆర్ డీజీ స్కూల్‌లో బోనాల సందడి

**వేద న్యూస్, కరీంనగర్ :**

ఆషాఢ మాసములో తెలంగాణ ప్రజలు జరుపుకునే బోనాల జాతర శనివారం ఎస్ ఆర్ డీజీ స్కూల్ స్కూల్ అశోక్ నగర్లో ఘనంగా నిర్వహంచారు. ఈ బోనాల సందడిలో పాఠశాల విద్యార్థులు బోనం వండి అమ్మవారుకు సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్ ఆర్ స్కూల్స్ జోనల్ ఇన్ చార్జ్ శశిధర్ మాట్లాడుతూ సంస్కృతీ సాంప్రదాయాన్ని కాపాడుకుంటూ తెలంగాణ వైభవాన్ని బోనాల విశిష్టత రాబోయే తరాలకు అందించాలి అని అన్నారు. ప్రిన్సిపల్ మానస మాట్లాడుతూ ఆషాఢమాసం అమ్మవారుకు ఎంతో ఇష్టమని తెలంగాణా విశిష్టతను తెలిపేది ఈ బోనాల పండుగ అని అన్నారు. అమ్మవారు, పోతరాజు వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ లావణ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎంపీ నిధులతో బోర్లు ఏర్పాటు

**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్,చొరవతో బోయినిపల్లి మండల కేంద్రంతో పాట మల్లాపూర్ గ్రామాలలో ప్రజల నీటి సమస్యను తొలగించడానికి బోర్లు మంజూరు చేయించారు. దీనికి బోయినిపల్లి ,మల్లాపూర్ గ్రామ ప్రజలు, బండి సంజయ్ కుమార్,కి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఎడపల్లి పరశు రాములు, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహాచారి, మాజీ మండల అధ్యక్షులు గుడి రవీందర్ రెడ్డి ,క్యాతం తిరుపతిరెడ్డి, రాజూరి కిరణ్,కిరణ్ బూత్ అధ్యక్షులు బోగోజి గంగాధర్ చారి ,మెరుపుల గంగాధర్ గౌడ్, రామానుజం, బ్రహ్మ ప్రసాద్, కళ్యాణం అనిల్, నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



వేద న్యూస్

ఆదివారం జులై 20, 2025

# బీ కేర్ ఫుల్.. బండి సంజయ్‌కు స్ట్రాంగ్ వార్నింగ్ ?



**వేద న్యూస్, హైదరాబాద్**

కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్ మధ్య వివాదం ముదురుతోంది. ఈటెల వర్గానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్లు ఇవ్వనంటూ బండి సంజయ్ పరోక్షంగా హెచ్చరించిన వ్యాఖ్యలపై ఈటల రాజేందర్ తీవ్రంగా స్పందించారు. శామీర్‌పేట్‌లోని తన నివాసంలో ముఖ్య నేతలతో ఈటెల సమావేశమై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై చర్చించారు. అనంతరం ఈటెల రాజేందర్ బండి సంజయ్ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందిస్తూ.. బహిరంగంగా మాట్లాడారు.స్ట్రెయిట్ ఫైట్ చేస్తా నీలాగా స్ట్రీట్ ఫైట్ చేయను అని బండి సంజయ్‌ను ఉద్దేశించి ఈటెల రాజేందర్ వ్యాఖ్యానించారు. ధీరునితో కొట్లాడుతం తప్ప.. కుట్రగాళ్లతో కొట్లాడేటోళం కాదు. ఈ కుట్రలను, కుతంత్రాలను చేసే వారి సంగతి తేల్చాల్సిన శక్తి ప్రజలకు మాత్రమే ఉంటది. రేపటి గెలుపునకు సంకేతమిచ్చే అడ్డా శామీర్‌పేట అడ్డా. వాడెవడో సైకోనా, శాడిస్టా, మనిషా, పశువా. వాడు ఏ పార్టీలో ఉన్నాడు. వాడు ఎవని అండతో ధైర్యం చేస్తున్నడు. కొడుకా బీ కేర్ ఫుల్ అని బండి సంజయ్‌ను ఈటెల రాజేందర్ హెచ్చరించారు.మేం శత్రువులతో కొట్లాడుతాం. కానీ కడుపులో కత్తులు పెట్టుకొని కౌగిలించుకునే సంస్కృతి నా రక్తంలో లేదు కొడుకా. ఇవాళ ఎవడెవడు సోషల్ మీడియాలో పెడుతున్నారో, రెచ్చగొడుతున్నారో వారి వివరాలను పైకి పంపించే ప్రయత్నం చేస్తాను. నీ శక్తి ఏంది..? నీ యుక్తి ఏంది..? నీ చరిత్ర ఏంది..? మా చరిత్ర ఏందో తెలుసా..? 2002లో వచ్చాడు ఆ జిల్లాకు. నేను రెండు సార్లు జిల్లా పార్టీ అధ్యక్షుడిగా పని చేశాను. రెండుసార్లు జిల్లా మంత్రిగా పని చేశాను. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నా అడుగు పడని గ్రామాల్లేవు. ఒక్క హుజురాబాద్, కమలాపూర్‌కే పరిమితం కాదు బిడ్డా.. కరీంనగర్ జిల్లా మొత్తం నా వెంబడి వచ్చేది. నా చరిత్ర నీకు చాలా తక్కువ తెలుసు కొడుకా అని ఈటెల రాజేందర్ పేర్కొన్నారు. మళ్లీ చెబుతున్నా.. హుజురాబాద్ గడ్డ మీద రేపు ప్రతి ఊరిలో మన వార్డు మెంబర్, నా సర్పంచ్ ఉంటడు. హుజురాబాద్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేకి ఎన్ని ఓట్లు వచ్చాయో ఎంపీకి కూడా అన్ని ఓట్లు వేయించాను. ఈ విషయం ఆయన అంతరాత్మకు తెలుసు. 2014 వరకు ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికలు కలిపే వచ్చాయి. 2019లో ఆనాడు నువ్వు కరీంనగర్ ఎంపీగా గెలిచినా హుజురాబాద్లో టీఆర్ఎస్ పార్టీకి 53 వేలు మెజారిటీ వచ్చింది. కేసీఆర్, వైఎస్ఆర్, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి లాంటి వాళ్లతో కొట్లాడినవాడిని.. బండి సంజయ్ లాంటి వాడితో కొట్లాడితే నా పతార ఏం కావాలి అని ఈటెల రాజేందర్ అన్నారు.

# రైతు బీమా చెక్కు అందజేత



**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం జెగ్గరావుపల్లి కి చెందిన చాడ జయపాల్ రెడ్డి, ప్రమాదవశాత్తూ మరణించగా నామినీ ఆయన భార్య చాడ లక్ష్మి సుమలత,కి రైతు భీమా పథకం క్రింద ఎల్ఐసి నుండి 5 లక్షల రూపాయలు వారి బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. దీనికి సంబందించిన ఉత్తర్వులు మర్లపేట గ్రామంలో నిర్వహించిన పామాయిల్ తోటలో గెలల కోత కార్యక్రమానికి విచ్చేసిన చొప్పదండి శాసన సభ్యులు మేడిపల్లి సత్యం,చేతుల మీదుగా చాడ లక్ష్మి సుమలతకు అందజేయడం జరిగింది.. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, ఏఎంసి చైర్మన్ బోయిని ఎల్లేష్,పిఏసిఎస్ నరసింగాపూర్ చైర్మన్ ముదిగంటి సురేందర్ రెడ్డి , ఎంపీడీఓ జయశీల, ఎమ్మార్వో నారాయణ రెడ్డి , మండల వ్యవసాయ అధికారి ప్రణీత, ఏఈవో రజిత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, వన్నల రమణారెడ్డి, భీంరెడ్డి మహేశ్వర్రెడ్డి, పులి లక్ష్మిపతి, పాల్గొన్నారు.

# సమస్య పరిష్కారం కాలేదని భిక్షాటన



**వేద న్యూస్, వేములవాడ :**


వేములవాడ పట్టణంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ఓ దంపతులు భిక్షాటన చేసి వినూత్న నిరసన తెలిపారు. తాళ్లపల్లి అక్షయ్-మమత దంపతులు గత మూడు నెలలుగా రేషన్ కార్డు కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా తమ సమస్యకు పరిష్కారం లేకపోవడంతో ఈ విధంగా నిరసనకు దిగినట్లు తెలిపారు.అధికారుల నిర్లక్ష్యంపై ఆవేదన వ్యక్తం చేసిన వారు,ఓపిక పోయి మీడియా ద్వారా మా సమస్యను తెలియజేయడానికి వచ్చాం అన్నారు.విలేకరులు విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లిన తర్వాత, అధికారుల ప్రతిస్పందనలో మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# షాద్‌నగర్ డిగ్రీ కాలేజీలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**వేద న్యూస్,షాద్‌నగర్ టౌన్ :**

షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో కంప్యూటర్ సైన్స్, ఇంగ్లీష్, సెరికల్చర్, తెలుగు, జువాలజీ బోధించేందుకు గాను అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఇంగ్లీష్-2, కంప్యూటర్ సైన్స్, సెరికల్చర్, తెలుగు,

జువాలజీ సబ్జెక్టుల్లో బోధించే దుకు ఒక్కొక్క పోస్టు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. అతిథి అధ్యాపకుల పోస్టులకు గాను ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు పీజీలో సంబంధిత సబ్జెక్టులో 50శాతం, ఇతరులు 55శాతం ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. అదే విధంగా పీహెచ్‌డీ, నెట్, స్లెట్, సెట్ అర్హత కలిగి అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగు



తుందన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 23వరకు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 24న మౌఖికక పరీక్ష ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.




# అంధ విద్యార్థులకు చేయూత

- డిపార్ట్మెంట్ ఆఫ్ సీఎస్ఈ (డేటా సైన్స్) దాతృత్వం
- కేరింగ్ హ్యాండ్స్ క్లబ్ విరాళ కార్యక్రమం విజయవంతం

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ఆఫ్ సీఎస్ఈ (డేటా సైన్స్) విభాగానికి చెందిన కేరింగ్ హ్యాండ్స్ క్లబ్ బ్రెయిల్ విద్యా సామగ్రి కోసం నిర్వహించిన విరాళ సేకరణ కార్యక్రమం నిర్వహించింది. శనివారం లూయిస్ ఆదర్శ ఆంధుల పాఠశాలలో విద్యార్థులకు బ్రెయిల్ షీట్స్, నిత్యవసర సరుకులను అందజేసి ఆదర్శంగా నిలిచారు.ఈ కార్యక్రమం డా. అయేషా బాను ప్రోత్సాహం, మార్గనిర్దేశనంతో విజయవంతం కావడం జరిగిందని కేరింగ్ హ్యాండ్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు పి. మౌనిక, బి. రోహిత్‌లు స్టూడెంట్ కోఆర్డినేటర్లుగా సంతోష్, సాత్విక్, వర్షిత, ఐశ్వర్యలు సమర్ధవంతంగా నిర్వహించారు.



# ప్రత్యేక రైళ్లను ప్రకటించిన దక్షిణ మధ్య రైల్వే..!

**వేద న్యూస్, హైదరాబాద్**

ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త చెప్పింది. కాచిగూడ-మధురై, హైదరాబాద్-కొల్లం, హైదరాబాద్- కన్యాకుమారికి ప్రత్యేక రైళ్లను నడిపించనున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం ఉన్న రద్దీని దృష్టిలో పెట్టుకొని స్పెషల్ రైళ్లను పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. కాచిగూడ-మధురై (07191) రైలును ఆగస్టు 18 నుంచి అక్టోబర్ 13 వరకు ప్రతి సోమవారం రాకపోకలు సాగిస్తున్నట్లు చెప్పింది. మధురై %-% కాచిగూడ (07192) రైలు ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 15 వరకు ప్రతి బుధవారం రైలు అందుబాటులో ఉండనుందని పేర్కొంది. హైదరాబాద్ - కొల్లం (07193) రైలు ఆగస్టు 16 నుంచి అక్టోబర్ 10 వరకు ప్రతి శనివారం.. కొల్లం - హైదరాబాద్ (07194) రైలు ఆగస్టు 18 నుంచి అక్టోబర్ 13 వరకు ప్రతి సోమవారం అందుబాటులో ఉంటుందని చెప్పింది. ఇక హైదరాబాద్ కన్యాకుమారి (07230) ఆగస్టు 13 నుంచి అక్టోబర్ 8 వరకు ప్రతి బుధవారం.. కన్యాకుమారి - హైదరాబాద్ (07229) రైలు ఆగస్టు 18 నుంచి అక్టోబర్ 10 వరకు ప్రతి శుక్రవారం





రాకపోకలు సాగిస్తుందని దక్షిణ మధ్య రైల్వే వివరించింది.

# నాలుగు రోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు..

**వేద న్యూస్, హైదరాబాద్**

తెలంగాణలో రాగల నాలుగు రోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఆదివారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో భారీ వానలు పడుతాయని తెలిపింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశం ఉందని పేర్కొంది. సోమవారం మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, సిద్దిపేట, రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు పడుతాయని చెప్పింది. ఈ సందర్భంగా ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేసింది. అలాగే, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, జనగాం, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని చెప్పింది.మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబా ద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అక్కడక్క భారీ వానలు పడే సూచనలున్నాయని.. మిగతా జిల్లా ల్లో గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో గాలులు వీస్తూ.. ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడుతాయని హెచ్చరించిం ది. బుధవారం భూపాలపల్లి, ములు గు, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో తెలంగాణవ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు



కురిశాయి. రాజన్న సిరిసిల్ల, మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, జనగాం, హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా సంగారెడ్డి జిల్లా పుల్కల్‌లో 12.9, రంగారెడ్డి జిల్లా ధర్మసాగర్‌లో 12.3 సెంటీమీటర్ల భారీ వర్షాపాతం నమోదైంది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073